## క్లుప్తంగా

### ఆర్థికసాయం అందజేత

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన క్రికెట్ క్రీడాకారుడు సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. సురేష్ స్నేహితులు విరాళాల రూపంలో సేకరించిన రూ.50 వేలను గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. సురేష్ మృతదేహాన్ని బెంగళూరు ఆసుపత్రి నుంచి తీసుకువచ్చేందుకు మరో రూ.50 వేలు గతంలో అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు రఘు, రాఘవేంద్ర, భరత్‌కుమార్, అశోక్ చక్రవర్తి, కోచ్ యుగేంద్ర పాల్గొన్నారు.

### 26 క్వింటాళ్ల బియ్యం రికవరీ



రికవరీ చేసిన బియ్యాన్ని చూపుతున్న తహసీల్దార్, ఇతర అధికారులు

నల్లమాడ: మండలంలోని పెమనకుంటపల్లిలో మాజీ డీలర్ అంజి, ప్రస్తుత డీలర్ బాబు నుంచి 26.5 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని రికవరీ చేసినట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బియ్యాన్ని రెండు రోజుల్లో గ్రామంలోని తెల్లరేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తామన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి అవినీతి, అక్రమాలు చోటు చేసుకోకుండా ప్రతి రెవెన్యూ గ్రామంలోను వీఆర్‌ఓను నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. ఈ మేరకు సమావేశం నిర్వహించి నిత్యావసర సరుకుల పంపిణీని పర్యవేక్షించాలని వీఆర్‌ఓలను ఆదేశించారు.

### కర్ణాటక మద్యం పట్టివేత

ఓడీ చెరువు: మండలంలోని గౌరాపురం క్రాస్ వద్ద గురువారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో కర్ణాటక మద్యం పట్టుబడింది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. కదిరి-హిందూపురం రహదారిపై గౌరాపురం క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు ద్విచక్ర వాహనాల్లో ముగ్గురు వ్యక్తులు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. 672 హైవార్డ్ విస్కీ టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశారు. ద్విచక్ర వాహనాలు, కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశారు. నిందితులు కొండకమర్ల గ్రామం గంగిరెడ్డిరెడ్డిపల్లికి చెందిన గంగులప్ప, శేషయ్యగారిపల్లికి చెందిన రాజు, శ్రీనివాసులుగా గుర్తించి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కిశోర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు మహబూబ్ బాషా, వెంకటేష్, వెంకటరమణ, సిబ్బంది రమేష్, అస్లాం, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

- ఇద్దరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న రమాదేవి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సెరికల్చర్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కేతిరెడ్డి కాలనీకి చెందిన రమాదేవి, ఆమె కుమారుడు చెన్నకేశవులు ద్విచక్ర వాహనంలో పట్టణంలో నుంచి కాలనీకి వెళుతుండగా సెరికల్చర్ కార్యాలయం వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాదేవి, చెన్నకేశవులు తీవ్రంగా గాయపడగాక.. స్థానికులు వారిని ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### చోరీలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక నిఘా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బ్యాంకులు, బంగారు దుకాణాల వద్ద చోరీలు జరగకుండా చెక్ పెట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకుతో పాటు బంగారు దుకాణాల వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బ్యాంకుల వద్ద మాస్కులు, టోపీలు పెట్టుకుని అనుమానంగా తిరుగుతున్న వారితో స్పెషల్ డివైజ్‌ల ద్వారా వేలిముద్రలు సేకరించారు. గతంలో ఏ కేసులలోనైనా నిందితులుగా ఉన్నారా అని తనిఖీ చేశారు. అనంతరం బంగారు దుకాణాలు ఎక్కువగా ఉన్న అంజుమన్ సర్కిల్‌లో విస్తృతంగా పర్యటించారు. దుకాణాల వద్ద అనుమానంగా సంచరిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేసినప్పుడు జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎక్కడైనా అనుమానంగా సంచరిస్తున్నట్లు వ్యక్తులు కనపడితే వెంటనే 100, 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తామన్నారు. అనంతరం బ్యాంకులో మేనేజర్‌తో మాట్లాడి ప్రతిచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.



గణేష్ సర్కిల్‌లో చెరకు రసం తీస్తున్న యువకుడు



గోకులంలో పుచ్చకాయల అంగడి



ప్రశాంతి నిలయంలో కొబ్బరి బొండాల విక్రయాలు..

## • వేసవిలో.. చల్ల చల్లగా

పట్టణంలో ఎండల తీవ్రత పెరిగింది. ఉక్కపోత పెరగడంతో చల్లని పానీయాలు, పళ్ల రసాలు, పండ్లు తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కళింగర (పుచ్చకాయ), కొబ్బరి బొండాలు, చెరుకు పాలు, ద్రాక్ష, అనాసపండు, దానిమ్మ, బొప్పాయి, చీనీ కాయలు, దోస కాయలకు డిమాండ్ పెరిగింది. కొబ్బరి బొండాం ఒక్కొక్కటి రూ.25 నుంచి రూ.40 వరకూ అమ్ముతున్నారు. చెరకు రసం గ్లాసు రూ.20, పుచ్చకాయలు సైజును బట్టి రూ.50 నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. తియ్యటి ఖర్బూజా కాయలు, చల్లని పళ్ల రసాలను తీసుకుంటూ ప్రజలు వేసవి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

– పుట్టపర్తి అర్బన్

### రేపటి నుంచి అచ్చామియా ఉరుసు



అలంకరణలో అచ్చామియా స్వామి సమాధి

ఓడీ చెరువు: మండలంలోని అచ్చామియాపల్లిలో హిందూ ముస్లింలు ఆరాధ్య దైవంగా భావించే అచ్చామియా స్వామి 430వ ఉరుసు ఉత్సవాలు ఈనెల 4వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నూర్‌బాబా హుస్సేన్, దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 4న శనివారం గంధం, 5న ఆదివారం ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొండమర్ల నుంచి మండల కో-ఆప్షన్ సభ్యుడు నిషార్ అహమ్మద్ ఇంటి నుంచి గంధం తీసుకెళ్లి స్వామికి సమర్పిస్తామన్నారు. మంగళ వాయిద్యాల మధ్య సుందరంగా అలంకరించిన మల్లెల గంపలో గంధం ఊరేగింపుతో అచ్చామియా దర్గాకు తరలివెళ్తారు. ఆదివారం ఉరుసు జరుగుతుంది. రాత్రి అన్నదానం తర్వాత కవ్వాలి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 'వెన్నపూస'కు మద్దతుగా ప్రచారం



గరిశలపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బత్తలపల్లి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి, ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడున్నర సంవత్సరాల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆటంకాలను అధిగమిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ముందుకు సాగుతున్నారన్నారు. ఈ క్రమంలో గత టీడీపీ ప్రభుత్వం చేసిన అప్పులను సైతం తీరుస్తూ, కరోనా వంటి విపత్కర పరిస్థితులను ఎదురైనప్పటికీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం నవరత్నాలు మొదలుకొని విభిన్న పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. నిరుద్యోగులకు అండగా ఉంటారన్నారు. డిగ్రీ చదువుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ, ప్రవేట్ రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, నాయకులు బండి వీరనారప్ప, చెన్నారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, రామాంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

**భారీ మెజారిటీతో గెలిపించాలి**

కొత్తచెరువు: తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని డీఈఓ కార్యాలయం, పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా నాయకులు రమణారెడ్డి, ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, సచివాలయ మండల చైర్మన్ సాంబశివారెడ్డి, షాన్‌షేట్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు

దర్మవరం అర్బన్/ధర్మవరం: తొగటవీధిలోని శాంతకళ చౌడేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ పూజల్లో తొగటవీర క్షత్రీయ కుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామి హాజరై పూజలు చేపట్టారు. భక్తులు ఆలయంపై ఉన్న కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన హోమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు పాల్గొని, పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల పాల్గొన్నారు.

**ఆలయానికి విరాళం**

ధర్మవరం: మండలంలోని బిల్వంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబోయే రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ గురువారం రూ.50 వేలు విరాళంగా అందించారు.

## బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలు



కొత్తచెరువు: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బత్తలపల్లి: మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో గురువారం శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బాణా సంచా కాలుస్తూ, బైకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని పూజలు నిర్వహించినట్లు బోడిమల్ల బాబురెడ్డి తెలిపారు.

కొత్తచెరువు: మండలంలోని మరకుంట పల్లిలో శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తలమర్ల మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌భార్గవ్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, నారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, కోనప్ప, రామిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అధికారులు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని మోటుమర్ల వద్ద వున్న కేజీబీవి పాఠశాలలో గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ థామస్ సెల్వి సల్మాన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళల పట్ల వివక్షత ఉండరాదన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ కళావతి, ప్రిన్సిపాల్ చంద్రకళ, డాక్టర్ ఉరుకుందప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కామేశ్వరి, వెంకట్రాముడు ఉపాధ్యాయులు ఆష్రా మాలిక్, వైద్య సిబ్బంది శివమ్మ, అనిత, చౌడయ్య పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థినులకు లింగ వివక్షత నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి



పార్టీ నాయకులకు సూచనలిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేతలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు విజయవంతంగా జరిగేందుకు సహాయ సహకారాలు అందించాలన్నారు. గ్రామ స్థాయిలో ఓటర్లను చైతన్యవంతం చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్‌పై 1, 2, 3 నంబర్లు మాత్రమే వేసేలా చూడాలన్నారు. అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న బాక్సులోనే నంబర్లు వేయాలన్నారు.

**ఓటరు స్లిప్పులు అందజేయాలి**

పుట్టపర్తి అర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ప్రతి ఓటరుకూ స్లిప్పులు అందజేసి సంతకాలు తీసుకోవాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీలోపు ప్రతి ఓటరుకూ స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. ఓటింగ్ సమయం, పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, డీటీ నరసింహులు పాల్గొన్నారు.

### మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట

నల్లమాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఔదార్యం చాటుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని సింగినేయకుంట వద్ద గురువారం రాత్రి 6 గంటల సమయంలో ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో సింగినేయకుంట కుంటకు చెందిన మేదర శివయ్య, తోలేటివారిపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి గాయపడ్డారు. అదే సమయంలో పుట్టపర్తి నుంచి స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లికి వెళ్తున్న ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులకు ధైర్యం చెప్పి చికిత్స కోసం తక్షణమే వారిని తన వాహనంలో నల్లమాడలోని 30 పడకల ఆస్పత్రికి తరలించారు. శివయ్యకు కుడికాలు విరగడంతో 108లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అలాగే అరవవాండ్లపల్లి తండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓడీ చెరువు మండలం కొండకమర్లకు చెందిన భజంత్రీ నారాయణ స్వామి స్వల్పంగా గాయపడ్డారు.

### బియ్యం ప్యాకెట్ల వితరణ

కదిరి అర్బన్: మండల పరిధిలోని గంగన్నగారిపల్లి రామాలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ గురువారం 10 బస్తాల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మొటుకుపల్లి ఎంపీటీసీ లోకేష్‌యాదవ్, వేణు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

బత్తలపల్లి: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు. గురువారం బత్తలపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో కిటికీలు, విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. ఎన్నికల అధికారుల నుంచి ఓటర్లకు పంపిణీ చేయాల్సిన స్లిప్‌లు కార్యాలయానికి చేరినట్లు వివరించారు. వాటిని ఆయా గ్రామాల వారీగా విభజించినట్లు తెలిపారు. ఆ తరువాత బీఎల్‌ఓలకు అందజేసి ఆయా గ్రామాల్లోని ఓటర్లకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బీఎల్‌ఓలు స్లిప్‌లు అందించిన తరువాత ఓటర్లతో సంతకాలు తీసుకుంటారన్నారు. పట్టభద్రులు 1,092, టీచర్స్ 52 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

### యువకుడి ఆత్మహత్యాయత్నం

తనకల్లు: మండల పరిధిలోని దండువారిపల్లిలో సిద్ధా విదీష్ నాయుడు అనే యువకుడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. సిద్ధా విదీష్ నాయుడు కర్బూజ పంటను సాగు చేస్తున్నాడు. పంటకు వాడే పురుగుల మందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం అతన్ని హుటాహుటినా కదిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు.మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

### ముళ్లపొదల తొలగింపు

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో త్వరలో కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను గురువారం సర్పంచు చెడిపోతుల గోపాల్ ఆధ్వర్యంలో జేసీబీతో తొలగిస్తున్నారు. అలాగే గుంతలు పడిన ప్రదేశాల్లో మట్టి వేయించారు.

## ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, చిత్రంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యే సిద్దారెడ్డి తదితరులు

కదిరి అర్బన్: ఈనెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, మన పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ పేర్కొన్నారు. గురువారం స్థానిక దత్తా గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, కదిరి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర జానపద, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ.. మన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఇతరులకు ఓట్లు వేస్తే మన ఓట్లు చీలడంతో పాటు టీడీపీకి లబ్ధి చేకూర్చిన వారు అవుతామన్నారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడైనా, ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటారేమో అని ముఖ్యమంత్రి భావించి మరోమారు సమావేశం నిర్వహించి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకునేలా చూడాలని చెప్పారన్నారు. ఒక్కో పంచాయితీలో దాదాపు 50 ఓట్లు దాకా ఉంటాయని, అందులో మనకు 45 ఓట్లు పడతాయన్నారు, అదే మున్సిపాలిటీలో అయితే ఒక్కో వార్డు 80 నుంచి 100 ఓట్ల దాకా ఉన్నాయని అందులో 70 దాకా మన పడతాయని ధీమా వ్యక్తం చేశారు. మీ పంచాయితీ, వార్డు పరిధిలో ఓటర్లను పోలింగ్ బూత్ వద్దకు తీసుకువచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి పేరు బ్యాలెట్ పేపర్‌లో 3వ స్థానంలో ఉందన్నారు. అభ్యర్థి ఎదురుగా ఉన్న ఖాళీ గడిలో నంబర్ 1 ఉంచాలన్నారు. అదీ పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే రాయాలన్నారు. కదిరి నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లు 7963 ఉన్నాయని వాటిలో అన్ని ఓట్లు పోల్ అయ్యేలా చూడాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మట్లాడుతూ.. మనకు ఈ ఎన్నికలు సెమీఫైనల్స్ లాంటివన్నారు. సమయం చాలా తక్కువగా ఉండటంతో మరింతగా ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చి మన అభ్యర్థులకే ఓటు వేసేలా చూడాలన్నారు. కొంత మంది నాయకుల్లో కొద్దో గొప్పో అసంతృప్తి ఉంటే వాటిని దూరం పెట్టి గెలుపునకు కృషి చేయాలన్నారు. వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన గెలుపు జగనన్న చేసిన అభివృద్ధికి గుర్తింపు అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహ్మద్‌షాకీర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేమల ఫయాజ్, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇస్తేమా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో శుక్రవారం ఇస్తేమా ప్రారంభకానుంది. గురువారం ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఇస్తేమాకు ఎలాంటి అసౌకర్యం కలగడకుండా ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సుమారు 2 లక్షల మంది ముస్లిం సోదరులు ఇస్తేమాకు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ఇస్తేమా జరగనుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి మహ్మద్ షాకీర్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, కౌన్సిలర్ జిలాన్ పాల్గొన్నారు.

## షాదీఖానా నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడికి ఉత్తర్వులు అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

కొత్తచెరువు: కొత్తచెరువు షాదీఖానా నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. 25 సంవత్సరాల క్రితం షాదీఖానా నిర్మించినప్పటికీ.. కమిటీ లేకపోవడంతో ఈ విషయాన్ని స్థానిక మైనారిటీ నాయకులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నిరుపయోగంగా ఉన్న ఈ షాదీఖానా అభివృద్ధికి రూ.35 లక్షల నిధులను వక్ఫ్‌బోర్డు నుంచి కేటాయించారు. ఈ షాదీఖానా నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కోల్‌కార్ జాకీర్ హుసేన్, ఉపాధ్యక్షుడిగా తయ్యూబ్ ఖాన్, ట్రెజరర్‌గా బాబా ఫకృద్దీన్, సెక్రెటరీగా మాణిక్యం ఆరీష్‌ను కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. నూతన కమిటీ బాగా పని చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

**శుభకార్యం..**

కొత్తచెరువు: మండల పరిధిలోని అప్పలవాడ్లపల్లి తండాకు చెందిన అశ్వర్థనాయక్ కుమార్తె అనూష వివాహానికి గురువారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

### ఎన్నికల నియమావళిపై అవగాహన

అమడగూరు: ఈనెల 13వ తేదీన జరగబోయే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిపై గురువారం రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్, ఎస్ఐ వెంకటనారాయణ, ఎంపీడీఓ నసీమా ఎన్నికల నిర్వహణ, నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, ఫోటోలు, కరపత్రాలు ఉండటానికి వీల్లేదన్నారు. అలాగే ఓటు ఎలా వేయాలో వివరించారు. ఈనెల 16వ తేదీ వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. వీధుల్లో ఎలాంటి గొడవలకు పాల్పడినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### 'గాలికుంటు' ప్రమాదకరం

బత్తలపల్లి: గాలికుంటు వ్యాధి సోకిన పశువుల ఆరోగ్యం పూర్తిగా క్షీణించి చనిపోయే ప్రమాదం ఉందని పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు నోటిలోనూ, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయన్నారు. పాడి పశువులకు అయితే పాదుగు ఎండిపోయి ఉంటుందన్నారు. పాల దిగుబడి క్షీణిస్తుందన్నారు. ఈ లక్షణాలుంటే వెంటనే పశువైద్యాధికారిని కలిసి వైద్యం చేయించాలన్నారు.